సాక్షి
అనకాపల్లి

సోమవారం, 8, సెప్టెంబర్, 2025

● మహిళల క్రికెట్ ప్రపంచ కప్ ట్రోఫీ ప్రదర్శన



మహిళల క్రికెట్ ప్రపంచకప్‌కు తొలిసారిగా ఆతిథ్యం ఇవ్వనున్న విశాఖలో ఆదివారం విజేతలకు అందించే ట్రోఫీని ప్రదర్శించారు. ప్రస్తుతం వైఎస్సార్ స్టేడియంలో జరుగుతున్న మహిళల క్రికెట్ లీగ్ సందర్భంగా ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి సానా సతీష్ మాట్లాడుతూ భవిష్యత్తులో మిథాలీ రాజ్ మెంటార్‌గా వ్యవహరించే సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ద్వారా గ్రామీణ పాఠశాల స్థాయి క్రీడాకారిణులకు అంతర్జాతీయ అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ప్రపంచకప్‌లోని ఐదు మ్యాచ్‌లకు విశాఖ వేదిక కానుంది.

- విశాఖ స్పోర్ట్స్

న్యూస్‌రీల్

ఫిషరీస్ డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

నర్సీపట్నం: బి.ఆర్.ఫిషరీస్ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఫిషరీస్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో డిప్లొమా కోర్సుల్లో చేరేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. స్పాట్ కౌన్సెలింగ్ ఈనెల 11వ తేదీ వరకు జరుగుతుందన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులు, ఇంటర్మీడియట్ ఫెయిల్ అయిన విద్యార్థులు కూడా ఈ కోర్సుకు దరఖాస్తు చేసుకోవడానికి వెసులుబాటు కల్పించారన్నారు. ఆసక్తిగల విద్యార్థులు మరిన్ని వివరాల కోసం 8247371907 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

నంబరు ప్లేటు మార్చి కోళ్ల వ్యర్థాల తరలింపు



వాహనానికి అతికించిన స్టిక్కర్

సింహాచలం: వాహనం నంబర్ ప్లేట్లను మార్చి కోళ్ల వ్యర్థాలను అక్రమంగా తరలిస్తున్న ఐదు వాహనాలను జీవీఎంసీ అధికారులు ఆదివారం గుర్తించారు. పాత అడవివరంలో తనిఖీలు నిర్వహించినప్పుడు ఈ విషయం వెలుగులోకి వచ్చింది. కోళ్ల వ్యర్థాల రవాణాకు జీవీఎంసీ కొన్ని ప్రత్యేక వాహనాలకు మాత్రమే అనుమతులు ఇచ్చింది. అయితే అనుమతి పొందిన వాహనాల నంబర్ ప్లేట్లను అక్రమంగా ఇతర వాహనాలకు మార్చి రవాణా చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. జీవీఎంసీ వెటర్నరీ అధికారి వాసు, జోన్-8 శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్, సిబ్బంది ఓ వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా, అసలు నంబర్ ప్లేటుపై మరో నంబర్ స్టిక్కర్ అతికించి ఉన్నట్లు కనుగొన్నారు. దీంతో అప్రమత్తమైన అధికారులు మొత్తం ఐదు వాహనాలను తనిఖీ చేశారు. వాటిలో రెండు వాహనాలకు మాత్రమే అనుమతులు ఉండగా, మిగిలిన మూడు వాహనాలపై అనుమానం రావడంతో వాటితో సహా మొత్తం ఐదు వాహనాలను ఆరిలోవలోని డంపింగ్ యార్డుకు తరలించి సీజ్ చేశారు. దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

అందరికీ యూరియా అందేలా చర్యలు

కలెక్టర్ విజయ కృష్ణన్



వెదురుపర్తిలో రైతులతో సమావేశమైన కలెక్టర్ విజయ కృష్ణన్

కశింకోట: అర్హులైన రైతులందరికీ యూరియా అందేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ విజయ కృష్ణన్ చెప్పారు. వెదురుపర్తి గ్రామంలో ఆదివారం పర్యటించి అక్కడి రైతు సేవా కేంద్రంలో రైతులతో సమావేశమయ్యారు. ఎరువుల పంపిణీ జరుగుతున్న తీరును, వాటిలో ఎదురయ్యే ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో 1500 మెట్రిక్ టన్నుల యూరియా ఎరువు నిల్వలు అందుబాటులో ఉన్నాయన్నారు. జిల్లాలో యూరియా లభ్యత కోసం ప్రతి గ్రామంలో తహసీల్దార్, ఎంపీడీవో, వ్యవసాయ అధికారుల ఆధ్వర్యంలో మూడు వేర్వేరు బృందాలను ఏర్పాటు చేశామన్నారు. మోతాదుకు మించి ఎరువులు వినియోగిస్తే దోమపోటు, పొడ తెగులు వంటి చీడ పీడల తాకిడి పెరిగే అవకాశం ఉందన్నారు. దీని దృష్ట్యా అధికారులు సూచించిన మేరకు యూరియా వినియోగించాలన్నారు. ఎవరైనా అధిక ధరలకు యూరియా విక్రయిస్తే సమీపంలోని మండల వ్యవసాయ అధికారికి ఫిర్యాదు చేయాలన్నారు. ఆర్డీవో షేక్ ఆయిషా, జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు, మండల ప్రత్యేక అధికారి సుభాషిణి, తహసీల్దార్ సీహెచ్.తిరుమలరావు, ఎంపీడీవో ధర్మారావు, మండల వ్యవసాయ అధికారి ఎం.స్వప్న పాల్గొన్నారు.

సంపత్ వినాయగర్ హుండీ ఆదాయం లెక్కింపు

మహారాణిపేట: ఆశీలమెట్టలోని శ్రీ సంపత్ వినాయగర్ దేవాలయంలో వినాయక ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన హుండీ ఆదాయం లెక్కింపులో 12 రోజుల్లో రూ.14,55,243 ఆదాయం లభించింది. ఈ లెక్కింపులో 5 గ్రాముల బంగారం, 101 గ్రాముల వెండి వచ్చినట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి, జిల్లా సహాయ కమిషనర్ డి.వి.వి.ప్రసాద్ తెలిపారు. అంతేకాకుండా విదేశీ కరెన్సీ లైన 21 అమెరికా డాలర్లు, 4 ఒమాన్ రియాల్స్, 10 కెనడా డాలర్లు, 10 యూరోలు, 10 ఇంగ్లాండ్ పౌండ్లు కూడా లభించాయి. లెక్కింపు కార్యక్రమంలో జగన్నాథ స్వామి ఆలయ ఈవో రాజగోపాల్ రెడ్డి పర్యవేక్షించగా, వేంకటేశ్వర సేవా సంఘం సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. లభించిన ఆదాయాన్ని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆశీలమెట్ట బ్రాంచ్‌కు అందజేశారు.

ఆలయాలు మూసివేత

చంద్రగ్రహణం కారణంగా దర్శనాలు బంద్

సంప్రోక్షణ అనంతరం నేటి ఉదయం 9 గంటల తర్వాత పునరుద్ధరణ



సింహాచలంలో రాజగోపురం ఎదురుగా నిర్మానుష్యంగా ఉన్న మాడ వీధి

సింహాచలం/నక్కపల్లి/నక్కపల్లి: సంపూర్ణ చంద్ర గ్రహణాన్ని పురస్కరించుకుని సింహాచలంతో సహా ఉమ్మడి విశాఖ జిల్లాలోని దేవాలయాలను ఆదివారం సాయంత్రం మూసివేశారు. ప్రముఖ పుణ్య క్షేత్రం ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయంలో సాయంత్రం ఆరాధనలు, నిత్య సేవాకాలం పూజలు నిర్వహించిన అనంతరం దర్శనాలను నిలిపివేసినట్టు ప్రధానార్చకులు గొట్టుముక్కల వర ప్రసాద్ తెలిపారు. సోమవారం ఉదయం సంప్రోక్షణ అనంతరం 9 గంటల తర్వాత మళ్లీ దర్శనాలు ప్రారంభమవుతాయని తెలిపారు, గరుడాద్రిపై వెలసిన స్వామివారి మూలవిరాట్ ఉన్న ఆలయం, క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామి సన్నిధి, ఆండాళ్లమ్మవారి సన్నిధి కోదండ రామాలయంతో పాటు ఉపాలయాలు, బంధుర సరస్సుకు అభిముఖంగా ఉన్న శ్రీ భువనేశ్వరి సమేత లక్ష్మణేశ్వర స్వామి ఆలయాలను మూసివేశారు. గ్రహణ మోక్ష కాలం అనంతరం సోమవారం వేకువజామున సంప్రోక్షణ కార్యక్రమాలు మొదలవుతాయి. స్వామివారికి నిత్యపూజలు, కై ంకర్యాలు నిర్వహించిన తర్వాత భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు. ఒడ్డిమెట్టలో కైలాసగిరిపై స్వయంభూగా వెలసిన లక్ష్మీగణపతి, నామవరంలోని స్వయంభూ రామలింగేశ్వరాలయం, కుర్తాళం పీఠాధిపతి ప్రతిష్ఠించిన నాడీ గణపతి ఆలయం, సీతమ్మవారి మెట్టపై ఉన్న ఉమా ధర్మలింగేశ్వరాలను కూడా మూసివేస్తున్నట్లు అర్చకులు తెలిపారు.



ఉపమాకలో వెంకన్న ఆలయాన్ని మూసివేసిన అర్చకులు, సిబ్బంది

నిర్మానుష్యంగా సింహగిరి

సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా ఆదివారం సింహగిరి నిర్మానుష్యంగా మారింది. సాధారణంగా ఆదివారం రోజున భక్తులతో రద్దీగా ఉండే సింహగిరి.. గ్రహణం ప్రభావంతో వెలవెలబోయింది. గ్రహణం దృష్ట్యా శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శనాలను ఉదయం 11.30 గంటల వరకే కల్పించారు. మధ్యాహ్నం 2.25 గంటలకు ఆలయ కవాట బంధనం చేశారు. అర్చకులు ఆలయ భోగమండపం ద్వారం, రాజగోపురం తలుపులను మూసివేశారు. అంతకుముందు స్వామికి రాజభోగం, మధ్యాహ్నం నిర్వహించాల్సిన పవళింపుసేవ, పౌర్ణమి తిరువీధి, రాత్రి ఆరాధన, పవళింపు సేవలను వరసగా నిర్వహించారు. సంప్రోక్షణ అనంతరం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శనాలు సోమవారం ఉదయం 8 గంటల నుంచి తిరిగి ప్రారంభమవుతాయి.

నూకాంబిక ఆలయంలో..

అనకాపల్లి గవరపాలెంలోని నూకాంబిక అమ్మవారి ఆలయంలో సంపూర్ణ చంద్రగ్రహణాన్ని పురస్కరించుకుని ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు దర్శనాలు నిలిపివేశారు. సంప్రోక్షణ అనంతరం సోమవారం ఉదయం 9 గంటల నుంచి భక్తులకు అమ్మవారి దర్శన భాగ్యం కల్పిస్తామని దేవదాయ శాఖ సహాయ కమిషనర్, ఆలయ ఈవో కె.ఎల్.సుధారాణి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



అనకాపల్లిలో నూకాంబిక అమ్మవారి ఆలయాన్ని మూసివేస్తున్న అర్చకుడు

జైలు అధికారుల నిర్లక్ష్యం వల్లే..

- సులువుగా తప్పించుకున్న రిమాండ్ ఖైదీలు
- మరింత దూరం పారిపోయేందుకు ప్రణాళిక
- సీసీ ఫుటేజీ ఆధారంతో విశాఖలో పట్టుకున్న పోలీసులు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ తుహిన్ సిన్హా



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా, చిత్రంలో నిందితులతోపాటు ఇతర పోలీసు అధికారులు

అనకాపల్లి టౌన్: చోడవరం సబ్ జైలులో డ్యూటీలో ఉన్న అధికారుల నిర్లక్ష్యం కారణంగానే రిమాండ్ ఖైదీలు జైలు నుంచి తప్పించుకున్నారని ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. ఎస్పీ కార్యాలయ సమావేశ మందిరంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో వెల్లడించిన వివరాలు.. అల్లూరి జిల్లా అనంతగిరి మండలం టోకూరు పంచాయతీ కార్యదర్శి సక్కా రవికుమార్ (30), అనకాపల్లి జిల్లా మాడుగులలో ఓ చోరీ కేసులో నిందితుడైన బెజవాడ రాము (26) చోడవరం సబ్ జైల్‌లో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. రవికుమార్, రాములకు బెయిల్ మంజూరైనప్పటికీ జామీను దొరకకపోవడం వల్ల జైలు నుంచి విడుదల కాలేదు. వీరిద్దరూ శారదా బ్యారక్‌లో ఉన్న మరో ఖైదీ ఏకస్వామితో సన్నిహితంగా మెలిగేవారు. ఆయన గతంలో హత్యాయత్నం తదితర కేసులలో నిందితుడు. 'మీకు ఎప్పటికీ జామీను దొరకదు, పది సంవత్సరాల జైలు శిక్ష తప్పద'ని భయపెట్టి జైలు నుంచి తప్పించుకోవాలని ప్రేరేపించాడు. జైలు సిబ్బంది వయసు మీరినవారని, అనారోగ్యంతో బాధపడుతున్నారని, వారిలో కేవలం కానిస్టేబుల్ నానాజీ మాత్రమే అప్రమత్తంగా ఉంటాడని చెప్పి, నానాజీ లేని సమయంలో తప్పించుకోవాలని సూచించాడు. హెడ్ వార్డర్ వీర్రాజు రికార్డులు రాయడంలో, వంటగది పనుల్లో రవికుమార్‌ను ఉపయోగించుకునేవారు. బ్యారక్ గేటు తాళం వేయకుండా ఆయన నిర్లక్ష్యంగా ఉండడం నిందితులు గమనించారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని వంటగదిలో ఇనుప సుత్తిని తీసుకొని, శుక్రవారం హెడ్ వార్డర్ వీర్రాజుపై దాడి చేశారు. ఇతర సిబ్బందిని గార్డు గదిలో బంధించి ఏఎస్ఐ కృష్ణమూర్తి దగ్గర ఉన్న ప్రధాన గేటు తాళాలు లాక్కొని తప్పించుకున్నారు. వీరు కొత్తూరు జంక్షన్, శివాలయం ఆర్చ్, పీఎస్ పేట మార్గంలో వెళ్లి బస్సులో విశాఖ చేరుకున్నారు. పోలీసులకు దొరక్కుండా మరింత దూరం పారిపోవాలని పథకం వేసుకున్నారు. అందుకు అవసరమైన సొమ్ము సంపాదించడానికి దొంగతనం చేయాలనుకున్నారు. రిమాండ్ ఖైదీలు తప్పించుకున్న వెంటనే అప్రమత్తమైన పోలీసు అధికారులు లుకౌట్ నోటీసులు జారీ చేసి వాట్సప్ గ్రూప్‌లు, పత్రికల ద్వారా విస్తృతంగా ప్రచారం చేశారు. సీసీ ఫుటేజీ సహాయంతో వారు విశాఖ వచ్చినట్లు గుర్తించారు. విశాఖ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు, అనకాపల్లి జిల్లా పోలీసులు నాలుగు బృందాలుగా ఏర్పడి విస్తృతంగా గాలించి, శనివారం రామ్‌నగర్ గొల్లలపాలెం ఎస్‌బీఐ బ్యాంక్ సమీపంలో ఖైదీలు రవికుమార్, రాములను పట్టుకున్నారు. జామీను భారం తగ్గించమని న్యాయస్థానాన్ని కోరేందుకు డిస్ట్రిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సహాయం కోసం తాను పెట్టుకున్న అర్జీని హెడ్ వార్డర్ వీర్రాజు తొక్కి పెట్టారని, ఆ కోపంతో తాను ఆయనపై సుత్తితో దాడి చేశానని నిందితుడు రవికుమార్ వెల్లడించినట్టు ఎస్పీ చెప్పారు. విలేకరుల సమావేశంలో డీఎస్పీ ఎం.శ్రావణి, చోడవరం ఎస్ఐ బి.కార్తీక్, జిల్లా సబ్ జైల్ ఇన్‌చార్జ్ ఆఫీసర్ డి.రాజు, తదితరులు పాల్గొన్నారు.

గంగపుత్రుల గోడు వినండి



చెరువులో మత్స్యకారుల అర్ధనగ్న ప్రదర్శన

- చేపల వేటకు అనుమతించి ఆదుకోండి
- నాయుడుచెరువులో అర్ధనగ్న ప్రదర్శన
- ప్రత్యేక మత్స్యకార సొసైటీ ఏర్పాటు చేయాలని వినతి

రావికమతం: మత్స్యకార కుటుంబాలకు ప్రత్యేక సొసైటీని ఏర్పాటు చేసి జీవనోపాధిని కల్పించాలని కోరుతూ ఆదివారం నాయుడు చెరువులో అర్ధనగ్న ప్రదర్శన చేశారు. కొత్తకోటలోని బేరా బాబూరావు, నూకరాజు, లక్ష్మణ్, మోరమెల్ల, ఇంటి నాగేశ్వర రావు కుటుంబాలకు చెందిన 18మంది మత్స్యకారులు రోలుగుంట మండలం కొమరవోలు స్వదేశీ మత్స్యకార సంఘంలో సభ్యులుగా కొనసాగుతున్నారు. గడిచిన ఐదేళ్లుగా సొసైటీ నడవట్లేదు. కల్యాణపులోవ జలాశయంలో చేపల వేట నిషేధంపై కోర్టులో కేసు నడుస్తోంది. చేపల వేట నిలిపివేయడంతో జీవనోపాధిని కోల్పోతున్నామని మత్స్యకారులు చెబుతున్నారు. కొత్తకోట పరిధిలో చేపల పెంపకానికి అనువైన చెరువులు ఉన్నాయి. చెరువులో చేపల పెంపకానికి స్థానిక గ్రామ పంచాయతీ పాలకులు అనుమతులు కల్పించాలని చెప్పారు. ప్రత్యేక మత్స్యకార సొసైటీని ఏర్పాటు చేయాలని గత రెండేళ్లుగా సంబంధిత అధికారులను కోరుతున్నా స్పందించడం లేదని, దీంతో తమ జీవనోపాధి అగమ్యగోచరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై 2024 ఫిబ్రవరి 12న, మార్చి11న స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతి పత్రాలు ఇచ్చామన్నారు. దీనిపై అప్పటి జిల్లా కలెక్టర్ విచారణ చేసి ప్రత్యేక సొసైటీ ఏర్పాట్లకు చర్యలు తీసుకుంటామని తెలిపారని, 2025 ఆగస్టు 11న పీజీఆర్ఎస్‌లో జిల్లా కలెక్టర్‌కు మరోమారు వినతి పత్రం ఇచ్చామని, సొసైటీ ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు మత్స్యశాఖ అధికారి జి.విజయ సమాచారం ఇచ్చారని, కానీ స్పందన లేదని ఆరోపించారు. అధికారులు తక్షణం సొసైటీ ఏర్పాటు చేసి తమ కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

సందడిగా సండేస్ ఆన్ సైకిల్స్



సైక్లింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించి, సైక్లింగ్‌లో పాల్గొన్న డీఆర్ఎం లలిత్ బోహ్రా

తాటిచెట్లపాలెం (విశాఖ): ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా, ఈస్ట్‌కోస్ట్‌రైల్వేలోని వాల్తేర్ డివిజన్‌లో 'సండేస్ ఆన్ సైకిల్స్' అనే కొత్త కార్యక్రమాన్ని డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా ప్రారంభించారు. ప్రతిరోజూ అరగంట వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఈ కార్యక్రమం ఉద్దేశం. ఈ సందర్భంగా డీఆర్ఎం, రైల్వే ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు డీఆర్ఎం నివాసం నుంచి డివిజన్ కార్యాలయం వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి ముందు, ఈస్ట్‌కోస్ట్‌రైల్వే ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు జ్యోత్స్న బోహ్రా ఆధ్వర్యంలో యోగా కార్యక్రమం జరిగింది. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల మానసిక ఒత్తిడిని తగ్గించడానికి ఈ కార్యక్రమాలు ఉపయోగపడతాయని డీఆర్ఎం తెలిపారు. యోగా, జుంబా, స్కిప్పింగ్ రోప్ వంటి కార్యక్రమాలను కూడా ఇందులో భాగం చేశారు. స్పోర్ట్స్ ఆఫీసర్ యం. హరనాథ్ , జనరల్ సెక్రటరీ ఎస్. ఉష ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

కష్టజీవుల పక్షాన 'అన్నదాత పోరు'



అన్నదాత పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

- రేపు వినతి పత్రం అందించేందుకు రైతులు తరలిరావాలి
- ఉదయం 9.30 గంటలకు అనకాపల్లి చేరుకోవాలి
- మాజీ డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు సూచన
- తారువలో అన్నదాత పోరు పోస్టర్ ఆవిష్కరణ

దేవరాపల్లి: యూరియా సహా రైతులకు అవసరమైన ఎరువులను అందజేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో అనకాపల్లిలో మంగళవారం చేపట్టనున్న 'అన్నదాత పోరు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు బూడి ముత్యాలనాయుడు కోరారు. యూరియా కొరతతో అన్నదాతలు పడుతున్న ఇబ్బందులపై మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. తారువలో ఆదివారం నియోజకవర్గ స్థాయిలో 'అన్నదాత పోరు' పోస్టర్‌ను పార్టీ శ్రేణులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. మాడుగుల నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల నుంచి రైతులు అనకాపల్లి రైల్వే స్టేషన్ రోడ్డులో ఉన్న వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయం వద్దకు మంగళవారం ఉదయం 9.30 గంటలకు చేరుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అక్కడి నుంచి ర్యాలీగా ఆర్డీవో కార్యాలయానికి చేరుకొని, రెవెన్యూ డివిజనల్ అధికారికి వినతి పత్రం అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, జెడ్పీటీసీ కర్రి సత్యం, వైస్ ఎంపీపీ పంచాడ సింహాచలంనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబూరావు, మండల యువజన అధ్యక్షుడు కర్రి సూరినాయుడు, సర్పంచ్‌లు నాగిరెడ్డి శతారినాయుడు, దాసరి సంతోష్‌కుమార్, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు పీజీఆర్ఎస్‌లో అర్జీల స్వీకరణ

తుమ్మపాల: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం కలెక్టరేట్‌లో యథావిధిగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ విజయ కృష్ణన్ ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌కు జిల్లాలో అన్ని ప్రాంతాల నుంచి ప్రజలు వచ్చి తమ సమస్యలను వినతుల రూపంలో అందించవచ్చన్నారు. కలెక్టరేట్‌తోపాటు ఆర్డీవో, మున్సిపల్, అన్ని మండల కార్యాలయాల్లో కూడా ఈ కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు అక్కడ కూడా అర్జీలు సమర్పించవచ్చన్నారు.

తిరగని బస్సు..

ప్రయాణికులు కస్సుబుస్సు

కృష్ణారాయుడుపేట వద్ద 2 నెలల క్రితం కుంగిన కల్వర్టు

- దేవరాపల్లి నుంచి కొత్తవలస మీదుగా రాకపోకలు బంద్
- మూడు జిల్లాల ఆర్టీసీ ప్రయాణికులకు అవస్థలు
- విశాఖ నుంచి కృష్ణారాయుడిపేట వరకే కొన్ని 12 డి బస్సు సర్వీసులు
- దేవరాపల్లి, ఆనందపురం నుంచి ఆటోల్లో చేరుకోవాల్సిన దుస్థితి
- అసలే అరకొరగా సర్వీసులు.. ఆపై సమయానికి రాని పరిస్థితి



కృష్ణారాయుడుపేట సమీపంలో కుంగిన కల్వర్టు

దేవరాపల్లి: ఆర్టీసీ ప్రయాణికుల బస్సు కష్టాలను తీర్చడంలో కూటమి ప్రభుత్వం అలసత్వం ప్రదర్శించడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కల్వర్టు కుంగిన కారణంగా బస్సు సర్వీసులను నిలిపివేసి సుమారు రెండు నెలలు కావస్తున్నా సమస్యకు పరిష్కార మార్గం చూపకపోవడంతో తీవ్రంగా మండిపడుతున్నారు. వెరసి అనకాపల్లి, అల్లూరి, విజయనగరం జిల్లాలకు చెందిన వందలాదిమంది ప్రయాణికులు, ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు నరకయాతన అనుభవిస్తున్నారు. స్త్రీశక్తి పథకం పేరుతో హడావుడి చేసిన ప్రభుత్వం బస్సులను పునరుద్ధరించడంపై దృష్టి సారించకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. అరకొర బస్సులతో మహిళలు సైతం నానా ప్రయాస పడుతున్నారు.

కృష్ణారాయుడుపేట వరకే 12 డి బస్సులు

విశాఖ నుంచి వచ్చే కొన్ని 12 డి బస్సులను కృష్ణారాయుడుపేట సమీపంలో కుంగిన కల్వర్టు వరకు మాత్రమే నడిపిస్తున్నారు. దీంతో కొత్తవలస వైపు వెళ్లే ప్రయాణికులు దేవరాపల్లి నుంచి కృష్ణారాయుడుపేట వరకు ఆటోల్లో చేరుకోవాల్సిన దయనీయ పరిస్థితి నెలకొంది. అలాగే విశాఖపట్నం నుంచి ఆనందపురం, దేవరాపల్లి తదితర ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు కృష్ణారాయుడుపేట వరకు బస్సులో వచ్చి అక్కడి నుంచి ఆటోల్లో రాకపోకలు సాగిస్తూ ఇబ్బందులు పడుతున్నారు. దీనిని ఆసరాగా చేసుకున్న ప్రైవేటు వాహనాదారులు అధిక మొత్తంలో చార్జీలు వసూలు చేస్తున్నట్లు పలువురు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా ప్రత్యామ్నాయంగా కొన్ని 12 డి బస్ సర్వీసులను రూట్ మళ్లించి ఆనందపురం, కె.కోటపాడు, పినగాడి, పెందుర్తి మీదుగా విశాఖపట్నానికి నడుతున్నప్పటికీ ప్రయాణ సమయం అధికమవ్వడంతో ప్రయాణికులు, ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారస్తులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఆ బస్సులైనా సమయానికి రాకపోవడంతో ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. గతంలో ప్రతి 15 నిముషాలకు 12 డి బస్సు సమయానికి రాకపోకలు సాగించి ఆర్టీసీకి అధిక ఆదాయాన్ని చేకూర్చేది. ప్రస్తుతం అసలే అరకొరగా బస్సులు నడుస్తుండగా అవి కూడా ఎప్పుడు వస్తాయో తెలియని అయోమయ పరిస్థితి దాపరించింది. సాయంత్రం ఏడు దాటితే బస్సులు రావడం గగనంగా ఉంది. దీంతో ప్రయాణికులు, ఉద్యోగులు, దేవరాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద గంటల కొద్దీ పడిగాపులు కాయాల్సిన దయనీయ పరిస్థితి నెలకొంది. కల్వర్టు నిర్మాణానికి జీవీఎంసీ నుంచి రూ. 90 లక్షలు నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే ప్రకటించి రెండు నెలలు కావస్తున్నా నేటికీ పనులు కార్యరూపం దాల్చలేదు.



కుంగిన కల్వర్టును పునర్నిర్మించి బస్సులను నడపాలని ఆందోళన చేస్తున్న ప్రయాణికులు

సమస్య ఇది....

దేవరాపల్లి నుంచి కొత్తవలస మీదుగా విశాఖపట్నం వెళ్లే మార్గంలో కృష్ణారాయుడుపేట సమీపంలో కల్వర్టు కుంగిపోవడంతో ఆర్టీసీ బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి. ఈ మార్గంలో నడిచే 12 డీ, 68 డీ ఆర్టీసీ బస్సు సర్వీసులను జూలై 21 నుంచి ఆర్టీసీ అధికారులు నిలిపివేశారు. సుమారు రెండు నెలలు కావస్తున్నా కుంగిన కల్వర్టుకు మరమ్మతులు లేదా పునఃనిర్మాణ పనులు చేపట్టలేదు. దీంతో నిత్యం పదుల సంఖ్యలో బస్సులు, అధిక సంఖ్యలో ప్రయాణికులతో కళకళలాడే దేవరాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణ కళాహీనంగా మారింది.

చిత్తశుద్ధి లేని ప్రభుత్వం



స్త్రీశక్తి పేరిట మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నట్లు ప్రకటించిన ప్రభుత్వం అందుకు తగ్గట్టుగా బస్సులు నడపకపోవడంతో ఈ ప్రాంత మహిళలం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం తక్షణమే స్పందించి కల్వర్టును నిర్మించడంతోపాటు గతంలో మాదిరిగా కొత్తవలస మీదుగా యథావిధిగా బస్సులు నడిపి ప్రజల ప్రయాణ కష్టాలు తీర్చాలి.

–గొర్రుపోటు రమాదేవి, మహిళ, దేవరాపల్లి

కల్వర్టు కుంగి రెండు నెలలైనా..



కృష్ణారాయుడుపేట సమీపంలో కూలిన కల్వర్టును తక్షణమే పునఃనిర్మించాలి. ప్రస్తుతం అరకొరగా బస్సులు నడుపుతున్నా అవి కూడా సకాలంలో రాక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారిలో కల్వర్టు కుంగి సుమారు రెండు నెలలు కావస్తున్నా పట్టించుకోక పోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం.

–డి.వెంకన్న, సీపీఎం నేత, దేవరాపల్లి

ఎడాపెడా ట్రాఫిక్ చలానాలు

- మోటార్ వాహన చట్ట కొత్త నిబంధనలతో భారీ జరిమానాలు
- వాహన దారుల బెంబేలు


మునగపాకలో వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

మునగపాక: ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడుతున్న వాహనదారులపై పోలీసులు జరిమానాలు విధిస్తున్నారు. గతంలో కన్నా పెద్ద మొత్తంలో జరిమానాలు విధించడంతో వాహన దారులు బెంబేలెత్తుతున్నారు. ఎడాపెడా ట్రాఫిక్ చలానాలు వేసేయడంతో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న చర్యలపై పెదవి విరుస్తున్నారు. చిన్న చిన్న ఉద్యోగాలు చేసే వారితో పాటు కూలీ పనులు చేసుకునే వారిపై పెను భారం మోపుతున్నారంటూ వాపోతున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చట్టాలు అందుబాటులోకి తీసుకురావడం తప్పులేదంటూనే జరిమానాలు భారీగా విధించడం పట్ల ప్రయాణాలు చేసే వారు విమర్శలు గుప్పిస్తున్నారు.

తరుచూ వాహన తనిఖీలు

వాహన నియమాలు పాటించని వాహనదారులపై పోలీసులు కొరడా ఝులిపిస్తున్నారు. ప్రతిరోజూ మండల కేంద్రంలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. పూడిమడక రోడ్డులో రాకపోకలు సాగించే వాహనాలను తనిఖీ చేయడంతో పాటు రికార్డులు పరిశీలిస్తున్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించడంతో పాటు ట్రాఫిక్ నియమాలు పాటించేలా అవగాహన కల్పిస్తున్నా కొంతమంది వాహన చోదకులు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో పోలీసులు అటువంటి వారిపై జరిమానాలు విధిస్తున్నారు. అయితే మునుపెన్నడూ లేని విధంగా భారీ జరిమానాలు విధించడం పట్ల వాహనచోదకులు ఆవేదన చెందుతున్నారు.

మోటార్ వాహన చట్టం ఈ ఏడాది మార్చి నుంచి కొత్త నిబంధనలను అమల్లోకి తెచ్చింది. కొత్త నిబంధనల ప్రకారం జరిమానాలు ఇలా....

- హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే రూ.1000
- సీటు బెల్ట్ లేకుండా కారు నడిపితే రూ.1000
- సిగ్నల్ జంప్‌తో పాటు రాంగ్ రూట్‌లో ప్రయాణిస్తే రూ.1000
- డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే రూ.10వేలతో పాటు లైసెన్స్ రద్దు
- సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తే తొలిసారిగా రూ.1000 , రెండో సారైతే రూ.10వేలు చెల్లించాలి.
- ఇన్సూరెన్స్ లేకుండా వాహనం నడిపితే తొలిసారిగా రూ.2వేలు, రెండో సారైతే రూ.4 వేలు చెల్లించాలి.
- డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే రూ.5వేలు జరిమానా
- బైక్‌పై ట్రిపుల్ రైడింగ్ చేస్తే రూ.1000
- యూనిఫాం లేకుండా ఆటో నడిపే డ్రైవర్‌కు రూ.300
- ద్విచక్ర వాహనం వెనుక కూర్చొన్న వ్యక్తి కూడా హెల్మెట్ ధరించాలి. అలా లేకుంటే రూ.1000 జరిమానా చెల్లించాలి.
- 108 వాహనంతో పాటు అత్యవసర వాహనాలకు దారివ్వకుంటే రూ.10వేలు

ప్రమాదాల నివారణకు సహకరించాలి




ప్రతి వాహనదారు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి, రోడ్డు ప్రమాదాల నివారణకు అవగాహన కల్పిస్తున్నా కొంతమంది నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతున్నారు. ప్రతి వాహనదారు తప్పనిసరిగా రికార్డులు అందుబాటులో ఉంచుకోవాలి. మద్యం తాగి వాహనాలు నడిపినా చర్యలు తప్పవు. ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి.

–పి.ప్రసాదరావు, ఎస్ఐ, మునగపాక

అచ్చెన్న చెరువును కాపాడండి

మట్టిని తరలిస్తున్న లారీలను అడ్డుకున్న గ్రామస్తులు


చెరువు మట్టిని కాపాడాలని ఆవేదన చెందుతున్న యర్రవరం గ్రామస్తులు


అర్ధరాత్రి యర్రవరం నుంచి మట్టి తరలిస్తున్న లారీలను అడ్డుకున్న గ్రామస్తులు

అచ్యుతాపురం రూరల్: అక్రమంగా తరలించుకుపోతున్న యర్రవరం గ్రామానికి చెందిన అచ్చెన్న చెరువును కాపాడాలని గ్రామస్తులు ఆందోళన చేశారు. శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత గ్రామంలో ప్రభుత్వ సర్వే నెం.147లో 14 ఎకరాల అచ్చెన్న చెరువులో అక్రమంగా చొరబడి చెరువు మట్టిని తరలించుకుపోతున్న భారీ టిప్పర్ లారీలను గ్రామస్తులు అడ్డుకున్నారు. తమ గ్రామానికి చెందిన సహజ సంపదను అక్రమంగా దోచుకుంటున్నారని ఆవేదన చెందారు. ఉపాధి హామీ పథకం పనులు చేసుకోవడానికి వీలు లేనంత విధంగా చెరువును నష్టపరుస్తున్నారన్నారు. రాత్రంతా నిద్రపోకుండా గ్రామస్తులు ప్రభుత్వ చెరువు మట్టి తరలిపోకుండా అచ్యుతాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానిక పోలీసులు లారీలను అచ్యుతాపురం పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారణ చేపడతామని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సాక్షితో మాట్లాడారు. నాలుగు రోజుల నుండి తమ గ్రామానికి చెందిన చెరువు మట్టిని అక్రమంగా తరలించారన్నారు. చెరువుపై ఆధారపడి ఉన్న 200 ఎకరాల పల్లపు పంట పొలాలు నష్టానికి గురౌతాయన్నారు. సుమారు 200 కుటుంబాలు 300 మంది అచ్చెన్న చెరువులోనే ఉపాధి హామీ పనులు చేసి ప్రతి సంవత్సరం జీవనం సాగిస్తున్నారన్నారు. పరిశ్రమలకు, వ్యాపార సముదాయాలకు, లే–అవుట్‌లకు, ఇంటి నిర్మాణాల్లో, ఖాళీ స్థలాల్లో ఫిల్లింగ్ చేసుకోవడానికి అనుమతులు లేకపోయినా పగలు రాత్రి అన్న తేడా లేకుండా చెరువు మట్టిని అక్రమంగా తరలించడంపై ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు.

మట్టి అక్రమ తవ్వకాలు అరికట్టాలి



గ్రామాల్లో కూటమి నాయకులు గ్రావెల్, మట్టి మాఫియాగా తయారయ్యారు. మండలంలో జరుగుతున్న అక్రమ గ్రావెల్, మట్టి తవ్వకాలపై అధికారులు కూటమి నాయకులకు వత్తాసు పలుకుతూ ప్రభుత్వ సంపదను దోచి పెట్టడం సరికాదు. ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ వనరులను కాపాడాలి.

–కరణం ధర్మశ్రీ, వైఎస్ఆర్‌సీపీ యలమంచిలి సమన్వయకర్త

కానరాని కీర్తికుమారి ఆచూకీ...

- ఉమ్మలాడ శారదానదిలో రెండో రోజు కొనసాగిన గాలింపు
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన పరవాడ డీఎస్పీ, యలమంచిలి సీఐ


ఉమ్మలాడ శారదానదిలో గాలిస్తున్న ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం

మునగపాక: ఉమ్మలాడ వద్ద శారదానదిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడిన కీర్తికుమారి ఆచూకీ రెండో రోజు కూడా లభ్యం కాలేదు. ఈ నెల 6 తేదీన అనకాపల్లికి చెందిన బుద్ద కీర్తికుమారి ఉమ్మలాడ శారదానదిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఎస్‌డీఆర్‌ఎఫ్ బృంద సభ్యులు నదిలో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టినా ఆమె ఆచూకీ లభించలేదు. సంఘటన స్థలాన్ని ఆదివారం సాయంత్రం పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్, యలమంచిలి సీఐ ధనుంజయరావు పరిశీలించారు. సహాయక చర్యలపై ఆరా తీశారు. వారి వెంట ఎస్ఐ ప్రసాదరావు పాల్గొన్నారు. కాగా కీర్తి కుమారి కుటుంబ సభ్యులు శారదానది ఒడ్డున అచేతనంగా వేచి ఉన్న దృశ్యం అందరినీ కంటతడి పెట్టింది.

అధికలోడుతో వెళ్తున్న టిప్పర్లు పట్టివేత

రూ.1.82 లక్షలు జరిమానా విధింపు


పోలీసులు పట్టుకున్న టిప్పర్లు

నక్కపల్లి: నిబంధనలకు విరుద్ధంగా అధిక లోడు వేయడమే కాకుండా టోల్‌ఫీజును ఎగ్గొట్టేందుకు దొడ్డిదారిలో వెళ్తున్న టిప్పర్లపై ఆదివారం పోలీసులు దాడులు చేశారు. మూడు టిప్పర్లను పట్టుకుని రవాణా శాఖ అధికారులకు అప్పగించడంతో వారు ఈ మూడు లారీలకు భారీగా జరిమానా విధించారు. వివరాల్లోకి వెళ్తే పరవాడ నుంచి కాకినాడ, రాజమండ్రి నుంచి రాంబిల్లి వైపు పెద్ద పెద్ద బండరాళ్లు, ఫ్లైయాష్, ఇసుక లోడుతో ఇటీవల కాలంలో నిత్యం వందల సంఖ్యలో టిప్పర్లు తిరుగుతున్నాయి. ఒక్కో టిప్పర్‌లో నిబంధనల ప్రకారం 40 టన్నులకు మించి లోడు వేయరాదు. కానీ ఈ ట్రిప్పర్లు 60 నుంచి 70 టన్నుల బరువుతో రాకపోకలు సాగిస్తున్నాయి. వేంపాడు టోల్‌ప్లాజా వద్ద వీటి బరువు పరిశీలించి అధిక ఫీజు వసూలు చేస్తున్నారు. టిప్పర్ యజమానులు టోల్‌ఫీజును ఎగ్గొట్టేందుకు దొడ్డిదారిని ఎంచుకున్నారు. నక్కపల్లి, ఉపమాక, చందనాడ, అమలాపురం మీదుగా వేంపాడు జాతీయ రహదారిని చేరుకుని అక్కడ నుంచి తమ గమ్యస్థానాలకు వెళ్తున్నాయి. రాజమండ్రి వైపు నుంచే వెళ్లే వాహనాలు కూడా వేంపాడు, అమలాపురం, చందనాడ, నర్సాపురం, ఉపమాక మీదుగా నక్కపల్లి చేరుకుని రాంబిల్లి వెళ్తున్నాయి. ఆదివారం ఉదయం మూడు టిప్పర్లు అధిక లోడుతో ఉపమాక మీదుగా వేంపాడు వెళ్తుండగా సీఐ కుమార స్వామి, ఎస్ఐ సన్నిబాబు దాడులు చేసి ఉపమాక వద్ద టిప్పర్లను పట్టుకున్నారు. పరిమితికి మించి లోడు వేసినట్టు గుర్తించి కేసులు నమోదు చేశారు. తదుపరి చర్యల నిమిత్తం నర్సీపట్నం ఎంవీఐకి పంపించగా మూడు లారీల్లో ఒకదానికి రూ.52 వేలు, రెండోదానికి రూ.58 వేలు, మూడో టిప్పర్‌కు రూ.72వేలు వెరసి మూడు టిప్పర్లకు రూ.1.82 లక్షలు పెనాల్టీ విధించినట్టు సిఐ కుమారస్వామి తెలిపారు.

ఏఎంఏఎల్ కళాశాలకు పూర్వవైభవం రావాలి


ఆదికవి నన్నయ్య మాజీ వీసీ ముత్యాల నాయుడును సత్కరిస్తున్న పూర్వపు విద్యార్థులు

అనకాపల్లి టౌన్: ఏఎంఏఎల్ కళాశాలకు పూర్వవైభవం తీసుకురావాలని ఏఎంఏఎల్ కళాశాలలో 1973 నుంచి 2021 వరకు చదివిన పూర్వ విద్యార్థులంతా ఆకాంక్షించారు. కళాశాల సమీపంలో ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో పూర్వవిద్యార్థుల సమావేశం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆదికవి నన్నయ్య మాజీ వైస్ చాన్సలర్ మురుముత్యాల నాయుడును ఘనంగా సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కళాశాలలకు మూల స్తంభాలు అని కొనియాడారు. ప్రభుత్వాలపై ఆధారపడకుండా ఉన్న ఈ కళాశాలలో చదువుకున్న వారు ప్రభుత్వ ఉద్యోగులుగా, వైద్యులుగా ఉన్నత స్థానాలలో స్థిరపడ్డారని అటువంటి వారి కలయిక కళాశాల భవిష్యత్‌కు దోహదపడాలని సూచించారు. ఎమ్మెల్యే కొణతాల మాట్లాడుతూ ఇదే కళాశాలలో చదువుకున్న తాను కూడా ఈ కార్యక్రమంలో పాలుపంచుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో వర్తక సంఘం అధ్యక్షుడు టి.రఘుబాబు, కళాశాల అధ్యక్షుడు శ్రీదరాల కృష్ణ ప్రేరాజు, కరస్పాండెంట్ పెంటకోట శ్రీనివాసరావు, పూర్వ విద్యార్థులు వంకాయల శివ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సంఘటిత పోరాటాలకు కార్మికులంతా సిద్ధం కావాలి


ముగింపు సభలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు

చోడవరం: సంఘటిత పోరాటాలకు కార్మికులంతా సిద్ధంగా ఉండాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.వి. నాగేశ్వరరావు పిలుపిచ్చారు. సెంట్రల్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ (సిఐటియూ)13వ జిల్లా మహాసభలు చోడవరంలో రెండ్రోజులుగా జరుగుతున్నాయి. ఈ మహాసభలు ఆదివారం ముగిశాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల చట్టాలపై అనుసరిస్తున్న వైఖరి, కార్మికుల ఉద్యమాలపై ఈ సభల్లో చర్చించారు. ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ కార్మిక వర్గాలపై తీవ్ర దాడులకు పాల్పడుతున్నాయని, దీనిని అంతా తిప్పి కొట్టాలన్నారు. భవిష్యత్ ఉద్యమాలు మరింత తీవ్ర తరం చేయాలన్నారు. ఇప్పటికే పనిగంటలు పెంచుతూ కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకోవడం, కాంట్రాక్టు కార్మికులను అప్కాస్ రద్దు చేసి ఏజెన్సీలకు అప్పగించాలని నిర్ణయం తీసుకోవడం అన్యాయమన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్మికులపై దాడిని ఎక్కుపెట్టిందన్నారు. అనకాపల్లి జిల్లాలో పారిశ్రామిక కార్మికుల సమస్యలపై మరింత ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఫార్మా, ఎస్ఈజెడ్‌లలో కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత లేవని ప్రమాదాల నివారణలకు యజమాన్యాలు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి కుమార్ మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాలో కార్మికులకు అండగా సీఐటీయూ ఎప్పుడూ నిలుస్తుందన్నారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యమానికి సీఐటీయూ తన వంతు భాగస్వామ్యం అందించిందన్నారు. భవిష్యత్ పోరాటాలకు కార్మికులంతా సిద్ధంగా ఉండాలని ఈ మహాజనసభలో తీర్మానించారు. 28 తీర్మానాలతో కార్యదర్శి నివేదికను సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. కార్యక్రమంలో సీఐటీయు నాయకులు లోకనాథం, జి. కోటేశ్వరరావు, ఆర్. శంకరరావు, వి.వి.శ్రీనివాసరావు, ఎ.రాజు, గూనూరు వరలక్ష్మి, ఎస్.వి.నాయుడు, గనిశెట్టి సత్యనారాయణ, ప్రేమ చంద్రశేఖర్, పాల్గొన్నారు.

అంకంరెడ్డి జమీలు సేవలు చిరస్మరణీయం


దివంగత నేత జమీలు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు, పార్టీ శ్రేణులు


శ్మశాన వాటికలో బోరు ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ అప్పలనర్స, సర్పంచ్ రాణి, ఉప సర్పంచ్ అప్పలరాజు

నాతవరం: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ మాజీ సభ్యుడు దివంగత నేత అంకంరెడ్డి జమీలు వర్థంతి ఆదివారం నాతవరంలో నిర్వహించారు. ప్రధాన కూడలి జంక్షన్‌లో దివంగత నేత జమీలు విగ్రహానికి పూలమాలలు వేసి నివాలులర్పించారు. తర్వాత జమీలు కుటుంబీలకుతో కలిసి నాతవరం శ్మశాన వాటికను శుభ్రం చేసి చేతి బోరు ఏర్పాటు చేసి జెడ్పీటీసీ సభ్యులు కాపారపు అప్పలనర్స, సర్పంచ్ గొలగాని రాణి, ఉప సర్పంచ్ కరక అప్పలరాజు ప్రారంభించారు. ఇక్కడ కుళాయిలు ఏర్పాటు కోసం పనులు చేస్తున్నారు. కార్యక్రమంలో సెంట్రల్ బ్యాంకు డైరెక్టరు అంకంరెడ్డి పార్వతి, వైఎస్సార్‌సీపీ మండల శాఖ అధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు, పామాయిల్ కార్పొరేషన్ రాష్ట మాజీ డైరెక్టరు పైల పోతురాజు, నాతవరం–1 ఎంపీటీసీ సభ్యులు కరక రేణుక నాతవరం–2 ఎంపీటీసీ సభ్యులు చెక్కా ప్రభావతి వైఎస్సార్‌సీపీ మండల యూత్ ఉపాధ్యక్షుడు రుత్తల నాగు, హైస్కూల్ విద్యా కమిటీ మాజీ చైర్మన్ రెడ్డి వరహాలబాబు, పార్టీ ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు చెక్కా జోగిరాజు, మహిళా విభాగం మండల శాఖ అధ్యక్షురాలు పోలుపర్తి రాధ, గ్రామ కమిటీ అధ్యక్షుడు లచ్చబాబు పాల్గొన్నారు.

పార్టీకి పూర్వ వైభవం తెచ్చేందుకు కృషి చేస్తా

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి సన్యాసిపాత్రుడు



నర్సీపట్నం: పార్టీ అధిష్టానం అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహిస్తూ, పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని నూతనంగా నియమితులైన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల సన్యాసిపాత్రుడు పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి తన కుటుంబానికి మొదటి నుండి రాజకీయంగా ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. తన సతీమణి అనితకు డీసీసీబీ చైర్‌పర్సన్‌గా అవకాశం కల్పించారని, ప్రస్తుతం తనకు పార్టీ రాష్ట్రస్థాయి కమిటీలో అవకాశం కల్పించడం సంతోషంగా ఉందన్నారు. విశాఖ సిటీలోని విశాఖ నార్త్, దక్షిణ నియోజకవర్గాల్లో పార్టీ పటిష్టతకు తన వంతు కృషి చేస్తానన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి..

రైతులు యూరియా కోసం పడుతున్న ఇబ్బందులపై పార్టీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ఈనెల 9న ఆర్డీవో కార్యాలయం వద్ద మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ ఆధ్వర్యంలో చేపడుతున్న ఆందోళను విజయవంతం చేయాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను అధిష్టానం ఆదేశాల మేరకు ప్రజల్లోకి తీసుకువెళ్లి కూటమి నాయకుల తీరును ఎండగట్టేందుకు పార్టీ నాయకులు కృషి చేయాలన్నారు.

బిగ్‌బాస్ హౌస్‌లోకి శ్రీజ

- జీవీఎంసీ అవుట్ సోర్సింగ్ సూపర్‌వైజర్ కుమార్తె ప్రతిభ
- హౌస్‌లో చోటు దక్కించుకున్న శ్రీజ



గోపాలపట్నం: దమ్మ శ్రీజ... ఈ పేరు ఇప్పుడు రాష్ట్రమంతా చర్చనీయాంశంగా మారింది. బిగ్‌బాస్ హౌస్‌లోకి అడుగు పెట్టి, తన దూకుడుతో ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. తన ప్రతిభతో బిగ్‌బాస్‌లో కచ్చితంగా రాణిస్తుందని ఈ ప్రాంతీయులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ నుంచి బిగ్‌బాస్ వరకు

శ్రీజ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. నెలకు రెండు లక్షలకు పైగా జీతం సంపాదిస్తున్నప్పటికీ, తన ప్రతిభను నిరూపించుకోవడానికి బిగ్‌బాస్‌ను ఒక వేదికగా ఎంచుకున్నారు. ఆడిషన్స్ అనే అగ్నిపరీక్షలో నెగ్గి, ఇప్పుడు ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమయ్యారు.

తండ్రి నిజాయతీ, అంకితభావం

శ్రీజ తండ్రి తండ్రి దమ్మ శ్రీను, జీవీఎంసీ 92వ వార్డులో పారిశుధ్య విభాగంలో అవుట్‌సోర్సింగ్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన ప్రజలకు సేవ చేయడంలో ముందుంటారు. వార్డులో ఏ సమస్య ఉన్నా, అది మురుగు కాల్వలైనా, చనిపోయిన వీధి కుక్కలైనా, వెంటనే అక్కడికి వెళ్లి పరిష్కరిస్తారు. ఒక సూపర్‌వైజర్‌గా కాకుండా, ఒక కార్మికుడిలా తన సిబ్బందితో కలిసి పనిచేసే గుణం ఆయనది. కొంతమంది దురభిమానం కారణంగా తోటి కార్మికుడు చేసిన దాడిలో ఒక కన్ను కోల్పోయారు.

శ్రీజకు మద్దతివ్వండి

తమ కుమార్తె శ్రీజకు మద్దతివ్వాలని శ్రీను దంపతులు కోరుతున్నారు. ప్రతీ ఎపిసోడ్‌లో ఆమె ఆట తీరును గమనించి, పూర్తి మద్దతు తెలిపి, ఓట్లు వేయాలని ప్రేక్షకులందరినీ విజ్ఞప్తి చేస్తున్నారు.



ముగిసిన ఫుడ్ ఫెస్టివల్

ఆరిలోవ(విశాఖ): బీచ్ రోడ్డులోని ఎంజీఎం గ్రౌండ్స్‌లో మూడు రోజుల పాటు జరిగిన ఫుడ్ ఫెస్టివల్ ఆదివారం ముగిసింది. ఆంధ్రప్రదేశ్ టూరిజం, హెచ్‌ఆర్‌ఏఏపీ, టూరిజం అండ్ ట్రావెల్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ, వీహెచ్‌ఎంఏ, ఈఎంఏ, ఏపీ చాంబర్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 5న ఈ ఫెస్టివల్ ప్రారంభమైంది. ఫెస్టివల్‌లో భాగంగా 45కు పైగా ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేయగా, మూడు రోజుల్లో వేలాది మంది సందర్శించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ఫెస్టివల్ విజయం సాధించిందని, వచ్చే ఏడాది 2026లో మరింత ఎక్కువ స్టాల్స్‌తో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, టూరిజం శాఖ అధికారులు జె.మాధవి, జగదీష్, ఫోరమ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతులకు సంపూర్ణ స్థాయిలో యూరియా సరఫరా చేయాలి


చోడవరంలో విలేకరులతో మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం జిల్లా ప్రతినిధులు

చోడవరం: జిల్లాలో రైతులకు అవసరమైనంత యూరియా అందించడంలో ప్రభుత్వం విఫలమయ్యిందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రతినిధులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చోడవరంలో ఏపీ రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు, జిల్లా ప్రధానకార్యదర్శి ఎం. అప్పలరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి. వెంకన్న ఆదివారం విలేరులతో మాట్లాడారు. రాష్ట్రంలో యూరియా కొరత లేదని ముఖ్యమంత్రి ప్రకటనలు చేస్తున్నప్పటికీ గ్రామాల్లో ఎక్కడా రైతులకు పూర్తిస్థాయిలో యూరియా ఎరువులు అందడం లేదని వారు ధ్వజమెత్తారు. జిల్లాలో 891మెట్రిక్ టన్నులుఅందుబాటులో ఉందని, మరో 1500 మెట్రిక్ టన్నులు అవసరమౌతాదని అధికారులే చెబుతున్నప్పటికీ ఆ స్థాయిలో యూరియా సరఫరా కాలేదన్నారు. అధికారిక లెక్కలు ప్రకారం ఇంత యూరియా అందుబాటులో ఉంటే ఎందుకు రైతులకు ఇవ్వడం లేదని వారు ప్రశ్నించారు. రైతు సేవాకేంద్రాలు, కోఆపరేటివ్ సొసైటీల ద్వారా మరింత ఎక్కువ యూరియాను సరఫరా చేసి రైతులకు విక్రయించాలని వారు డిమాండ్ చేశారు. బ్లాక్ మార్కెట్ షాపులపై దాడులు చేయాలన్నారు. రైతులకు అవసరమైనంత యూరియా సరఫరా చేయకపోతే రైతుల నుంచి ఉద్యమం చేపడతామని వారు హెచ్చరించారు.


చౌసింగా పిల్లలు


కృష్ణ జింక పిల్ల


బ్లూ గోల్డ్ మెకావ్ పిల్ల

జూలో కూనల కనువిందు

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూలాజికల్ పార్కులో వన్యప్రాణుల సంతానోత్పత్తి కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. మూడు నెలల కిందట పలు జంతువులు, పక్షులు పిల్లలకు జన్మనివ్వగా, తాజాగా మరికొన్ని వన్యప్రాణులకు పిల్లలు పుట్టాయి. ఇటీవల జూలో రెండు చౌసింగాలు (ఒక మగ, ఒక ఆడ), ఒక మగ కృష్ణ జింక పిల్ల, రెండు బ్లూ గోల్డ్ మకావ్ పక్షులు జన్మించాయని జూ క్యూరేటర్ జి. మంగమ్మ ఆదివారం తెలిపారు. తల్లీపిల్లలు అన్నీ సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. ప్రస్తుతం చౌసింగా, కృష్ణ జింక పిల్లలు వాటి ఎన్‌క్లోజర్‌లలో తల్లుల చెంత ఉత్సాహంగా ఆడుకుంటూ సందర్శకులకు కనువిందు చేస్తున్నాయి.


ఆకులు తింటున్న తల్లి జింక, తల్లి పాలు తాగుతున్న చౌసింగా జింక

క్లుప్తంగా

వైభవంగా ఊంజల్ సేవ



ఊంజల్ సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

అనకాపల్లి: స్థానిక దేవునిగుమ్మం వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం రాత్రి అత్యంత వైభవంగా స్వామివారి ఊంజల్ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్చకులు రాజేష్, ప్రసాద్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బొలిశెట్టి శ్రీనివాసరావు, మద్దాల కృష్ణారావు, అమరపల్లి కృష్ణాజీ, కసిరెడ్డి సూరిబాబు, దాసరి రామకృష్ణ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గవరపాలెం వాగ్దేయ వరదాయిని వ్యవస్థాపకుడు తిమ్మాపాత్రుని చక్రవర్తి ఆధ్వర్యంలో అన్నమాచార్య కీర్తనలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

నేడు పార్టీ నేతలతో సమావేశం

అనకాపల్లి: స్థానిక రింగ్‌రోడ్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ సోమవారం ఉదయం 10 గంటలకు పార్టీ శ్రేణులకు అందుబాటులో ఉంటారని పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు మందపాటి జానకీరామరాజు, పెదిశెట్టి గోవింద్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 9వ తేదీన జరిగే అన్నదాత పోరుబాట కార్యక్రమంపై పార్టీ నాయకులతో సమావేశం నిర్వహిస్తారన్నారు. నియోజకవర్గంలో పార్టీ శ్రేణులు హాజరు కావాలని కోరారు.

14న 500 మొక్కలు నాటుతాం

అనకాపల్లి: గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 14న మండలంలో బీఆర్టీ, రామాపురం కాలనీల్లో ఉదయం 8 గంటలకు మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గ్రీన్ క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రహదారుల చుట్టూ 500 మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, గ్రీన్ క్లబ్ సభ్యులు హాజరు కావాలని కోరారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

తుమ్మపాల: కొప్పాక 33/11కేవీ సబ్ సెక్షన్ పరిధి ఆర్‌డీఎస్‌ఎస్ రూరల్ ఫీడర్‌కు సంబంధించి మరమ్మతుల వల్ల ఈ నెల 8, 9 తేదీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ కశింకోట డివిజన్ ఈఈ ఎస్. రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో గోపాలపురం, గోపాలపురం కాలనీ, వెంకటరమణయ్యపేట గ్రామాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా ఉండబోదన్నారు. ఆయా గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

సీఐటీయూ జిల్లా కార్యదర్శిగా రాజేష్



రాజేష్

నక్కపల్లి: సీఐటీయూ జిల్లా కార్యదర్శిగా నక్కపల్లికి చెందిన మనబాల రాజేష్ ఎన్నికయ్యారు. ఆదివారం చోడవరంలో జరిగిన సీఐటీయూ జిల్లా మహాసభల్లో ఆయన్ను ఎన్నుకున్నారు. చిన్న వయసులోనే ప్రజా సమస్యలపై ఇతను చేస్తున్న పోరాటాలను గుర్తించి జిల్లా సమావేశాల్లో ఎన్నుకున్నట్లు సీఐటీయూ వర్గాలు తెలిపాయి. రాజేష్‌కు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం అప్పలరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం సత్యనారాయణ, అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎం దుర్గారాణి, ఆటో యూనియన్ అధ్యక్షుడు పిక్కి శ్రీనివాస్, త్రినాథరావు అభినందనలు తెలిపారు.

అనకాపల్లి సినిమాలు

రాజా	: మదరాసి
సత్యనారాయణ స్క్రీన్-1	: కొత్తలోక
సత్యనారాయణ స్క్రీన్-2	: ది కన్జూరింగ్ 4 లాస్ట్ రైట్స్
పర్తిసాయి	: ఘాటీ
షిర్డీసాయి	: కూలీ
వెంకటేశ్వర	: లిటిల్ హార్ట్స్
రామచంద్ర	: వార్-2

రక్త నిల్వలు


అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 79 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్-9, బీ పాజిటివ్-27, ఓ పాజిటివ్-39, ఏబీ పాజిటివ్-5 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ యూ లోకేష్ (9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 253 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 206 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి (08924-223595)ని సంప్రదించవచ్చు.

మందకొడిగా వరినాట్లు

- ఇంతవరకు 70 శాతమే నాట్లు
- పుష్కలంగా నీరు లేక ఇబ్బందులు
- సరైన వర్షాలు లేవని రైతుల వేదన



కశింకోట వద్ద కొంత మేర ఇప్పటికే వేసిన వరి నాట్లు



వరి నాట్లు వేస్తున్న మహిళలు

ఖరీఫ్ ప్రారంభం నుంచి వరుణుడు దోబూచులాడుతున్నాడు. జూన్, జూలై మాసాల్లో పెద్దగా కురవని వానలతో నారుమడులు కాపాడుకునేందుకు రైతులు అవస్థలు పడ్డారు. ఆగస్టులో కురిసిన వర్షాలతో దమ్ములు ప్రారంభించినా, చాలినంత నీరు లేక మందకొడిగా నాట్లు పడుతున్నాయి.

కశింకోట: మండలంలో ఖరీఫ్ వరినాట్లు పూర్తి కాలేదు. ఇప్పటికి 70 శాతం వరకు నాట్లు జరిగాయి. మిగిలినవి సరైన వర్షాలు లేక నీటి సదుపాయం ఉన్నచోట మందకొడిగా నాట్లు వేసే ప్రక్రియ సాగుతోంది. తుపానులు, అల్ప పీడనాలు వల్ల వర్షాలు పడుతున్నారు. లేదంటే చిన్నా చితక పడుతున్న వర్షాలు ఉపయోగపడటం లేదు. సమృద్ధిగా వర్షాలు పడితే ఇప్పటికే నాట్లు పూర్తి కావలసింది. ఆదివారం భారీ వర్షం కురిసింది. దీంతోపాటు ముున్ముందు వర్షాలు పడితే నాట్లు పూర్తి కాగలవని అధికారులు, రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఖరీఫ్ వరి పంటను అన్ని పంటల కంటే ఎక్కువగా వర్షాధారంగా సాగు చేస్తుంటారు.

మండలంలో వరి సాధారణ విస్తీర్ణం ఈ ఏడాది 1048 హెక్టార్లుగా ఉంది. కశింకోట, బయ్యవరం, వెదురుపర్తి, తేగాడ, కొత్తపల్లి, బుచ్చియ్యపేట, పేరంటాలపాలెం, పరవాడపాలెం, జమాదులపాలెం, ఉగ్గినపాలెం, తాళ్లపాలెం, గొబ్బూరు, ఏఎస్ పేట, సోమవరం, నూతలగుంటపాలెం, నరసింగబిల్లి, చింతలపాలెం, అచ్యుతాపురం, అడ్డాం, అచ్చెర్ల, జి. భీమవరం, సుందరయ్యపేట, తీడ, చెరకాం, కన్నూరుపాలెం, మోసయ్యపేట తదితర గ్రామాల్లో వరి ఎక్కువగా సాగు చేస్తారు. వర్షం, శారదానది నీరు, సాగునీటి చెరువు, గెడ్డల నీరు ఆధారంగా ఎక్కువగా పండిస్తారు. సదుపాయం ఉన్న వారు బోరు నీటితో సాగు చేస్తారు. గత నెలలో రెండు దఫాలు తుపాను, అల్పపీడనాల ప్రభావంతో భారీ వర్షాలు పడ్డాయి. రైతులను ఇవి బాగా ఆదుకున్నాయనే చెప్పాలి. అప్పటి వరకు నాట్లు ఐదు శాతం కూడా నాట్లు పడలేదు. భారీ వర్షాలతో ఒక్కసారిగా ముమ్మరంగా నాట్లు వేశారు.

సరైన నీటి సదుపాయం లేక

బయ్యవరం పెద్ద చెరువులో నీరు చేరడంతో దీని ఆయకట్టు సుమారు 500 అధిక విస్తీర్ణం భూముల్లో ఎక్కువగా నాట్లు వేయడానికి అవకాశం కలిగింది. ఆ తర్వాత సరైన వర్షాలు పడలేదు. దీంతో సరైన నీటి సదుపాయం లేక పలు గ్రామాల్లో నాట్లు వేయడం ఒక్కసారిగా మందగించింది. దీంతో ఇప్పటికే దాదాపు పూర్తి కావలసిన నాట్లు ఇంకా పూర్తి కాని పరిస్థితి నెలకొంది. వరి సాధారణ విస్తీర్ణంలో ఇప్పటికి 708 హెక్టార్ల మేర నాట్లు వేశారు. ఇంకా 340 హెక్టార్లలో నాట్లు వేయాల్సి ఉంది.

మండలంలో భారీ వర్షం

ఆదివారం మధ్యాహ్నం ఇక్కడ భారీగా వర్షం కురిసింది. ఇది నాట్లు వేయడానికి కొంతమేర ఉపకరించనుందని రైతులు అంటున్నారు. దీంతోపాటు ముున్ముందు కూడా పెద్ద వర్షాలు కురిసి నదిలోను, గెడ్డలలోను వరద నీరు వస్తే నెలాఖరులోగా నాట్లు పూర్తి కాగలవని రైతులు, అధికారులు ఆశిస్తున్నారు.

వర్షాలు పడితే నెలాఖరులోగా నాట్లు పూర్తి

మండలంలో ఖరీఫ్ వరి సాధారణ విస్తీర్ణం 1048 హెక్టార్లు. వీటిలో 708 హెక్టార్లలో నాట్లు పూర్తి అయ్యాయి. మిగిలిన 340 హెక్టార్లలో నాట్లు పడాల్సి ఉంది. సరైన వర్షాలు లేక దాదాపు పూర్తి కావలసిన నాట్లు ఇంకా కాలేదు. ఇకపై బాగా వర్షాలు పడితే నెలాఖరులోగా నాట్లు పూర్తి కాగలవు.

-ఎం. స్వప్న, మండల వ్యవసాయ అధికారి, కశింకోట

దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలి

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు పాత్రపల్లి వీరుయాదవ్



మాట్లాడుతున్న వీరుయాదవ్

అనకాపల్లి: స్త్రీ శక్తి పథకంలో భాగంగా రాష్ట్రంలో మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన మాదిరిగా దివ్యాంగులకు అమలు చేసే విధంగా కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు పాత్రపల్లి వీరుయాదవ్ కోరారు. స్థానిక ఉడ్‌పేట సంఘం కార్యాలయంలో జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ సహకారంతో దివ్యాంగులైన మాటూరు ఏసుదాసు, బానోద్ దిలీప్‌లకు ట్రై సైకిల్, వీల్ చైర్ ఆదివారం ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదరం సర్టిఫికెట్ ఆధారంగా రాష్ట్రంలో దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి మొల్లి చంద్రశేఖర్, సభ్యుడు చెట్టుపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కశింకోటలో భారీ వర్షం



కశింకోట ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణం వర్షపు నీటితో చెరువు మయం




పీహెచ్‌సీకి వెళ్లే రోడ్డులో చేరిన వర్షపు నీటిలో రాకపోకలకు ప్రజలు పడుతున్న ఇబ్బంది

కశింకోట: మండలం కేంద్రంలో ఆదివారం మధ్యాహ్నం భారీ వర్షం దంచి కొట్టింది. ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షం వల్ల లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లపై ఏరులా నీరు ప్రవాహం సాగింది. 85.4 మిల్లీ మీటర్లు వర్షం పడినట్లు నమోదైంది. కశింకోట ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణం నీటితో నిండిపోయి చెరువులా మారింది. పీహెచ్‌సీ, అఫీషియల్ కాలనీ, సమగ్ర బాలికల వసతి గృహాలకు వెళ్లే రోడ్డు వర్షపు నీటి ముంపునకు గురయ్యాయి. దీంతో మోకాళ్ల లోతులో రాకపోకలు సాగించడానికి ప్రజలు, సమగ్ర వసతి గృహానికి తమ పిల్లలను చూడటానికి వచ్చే తల్లిదండ్రులు, పీహెచ్‌సీ సిబ్బంది ఇబ్బంది పడ్డారు. స్థానిక గవరపేటలోని మధ్య వీధి, గాడి వీధి, తదితర ప్రాంతాల్లోని పల్లపు ప్రాంత వీధి రోడ్లపై ఏరులా వర్షపు నీరు పారడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. వర్షం పంటలకు బాగా ఉపయోగపడుతుందని, ప్రధానంగా ఖరీఫ్ వరి నాట్లకు, నారు నాటడానికి ఉపకరిస్తుందని రైతులు తెలిపారు. వర్షం వల్ల కొంత సేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

ఆలయాలకు చంద్రగ్రహణం ఎఫెక్ట్



కశింకోటలో మూసి వేసిన జాతీయ రహదారి పక్కన అభయ ఆంజనేయస్వామి ఆలయం



మూసి వేసిన ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయం

కశింకోట: మండలంలో పలు దేవాలయాలను ఆదివారం రాత్రి చంద్ర గ్రహణం కారణంగా మూసి వేశారు. దేవదాయ శాఖకు చెందిన వేణుగోపాలస్వామి ఆలయంతోపాటు కోదండ సీతారామచంద్రమూర్తి స్వామి ఆలయం, రామాలయం, స్థానిక వేంకటేశ్వరస్వామి ధ్యాన మందిరం, శివాలయం, లక్ష్మీనృసింహస్వామి, నూకాంబిక, గవరపేటలోని వేంకటేశ్వరస్వామి, దుర్గమాంబ, జాతీయ రహదారి, పూసర్ల వీధి, కుమ్మరి వీధి, వడ్డి వీధి, కనకమహాలక్ష్మి వీధి, హౌసింగ్ కాలనీ ప్రాంతాల్లో ఆంజనేయస్వామి ఆలయాలు మూసి వేశారు. వీటిని సంప్రోక్షణ అనంతరం సోమవారం ఉదయం తెరవనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

క్వారీ బ్లాస్టింగ్‌లో దెబ్బతిన్న ఇళ్లకు పరిహారం ఇవ్వాలి



రాజన్నపేటలో సీపీఎం నాయకుడు గోవింద, బాధితులు

రోలుగుంట : శరభవరం పంచాయతీ శివారు రాజన్నపేట గ్రామంలో ఇటీవల సమీప క్వారీలో బ్లాస్టింగ్‌ల వల్ల రాళ్లు పడి కొన్ని గృహాలు దెబ్బతిన్నాయి. ఈ విషయాన్ని మైనింగ్, తదితర అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని సీపీఎం ఆధ్వర్యంలో బాధితులు ఆదివారం ఆందోళన చేశారు. అధికారులు నిర్లక్ష్య వైఖరి వీడాలని, దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకుడు గోవింద ఆధ్వర్యంలో బాధితులు ఆందోళనలో పాల్గొన్నారు.

15 నుంచి 'రణభేరి ప్రచార జాతా'



రణభేరి ప్రచార జాతా కరపత్రాలను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

అనకాపల్లి: కూటమి ప్రభుత్వం కొత్త పీఆర్సీ, బకాయిపడ్డ డీఏలు అమలు చేయాలని కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 15న శ్రీకాకుళం జిల్లా సోంపేట నుంచి రణభేరి ప్రచార జాతా నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయ్ తెలిపారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన యూటీఎఫ్ జిల్లా సమావేశంలో జాతా కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం నుంచి రావలసిన పీఆర్సీ, డీఏలు, ఆర్థిక బకాయిలు తదితర సమస్యల సాధన కోరుతూ ఈ నెల 15 నుంచి 19 వరకూ ఉత్తరాంధ్రలో జాతా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ జాతా శ్రీకాకుళం నుంచి అల్లూరి సీతారామరాజు జిల్లా మీదుగా అనకాపల్లి జిల్లాకు ఈ నెల 18న మాడుగుల నియోజకవర్గానికి చేరుకుంటుందన్నారు. అక్కడ నుంచి బైక్ రాలీగా అనకాపల్లి సీఐటీయూ కార్యాలయానికి చేరుకుని కార్యాలయం వద్ద బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయులను చదువు చెప్పడానికి మాత్రమే ప్రభుత్వం వినియోగించుకోవాలని, పాఠశాలల్లో బోధనేతర కార్యక్రమాలు రద్దు చేయాలని కోరారు. అస్తవ్యస్తంగా పునర్వ్యవస్థీకరించిన పాఠశాలల వ్యవస్థను సరిదిద్దాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇవ్వవలసిన రూ. 25 వేలకోట్ల ఆర్థిక బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. విశ్రాంత ఉద్యోగులకు బకాయిపడ్డ ఉద్యోగులకు పెన్షన్, గ్రాట్యూటీ, పీఎఫ్, ఏపీజీఎల్ఐ మొదలగు బకాయిలను తక్షణమే చెల్లించాలన్నారు. పీఆర్సీ అమలు చేసే వరకూ మధ్యంతర భృతిని అమలు చేయాలని కోరారు. ఈ నెల 25న విజయవాడలో భారీ రణభేరి బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి, రాష్ట్ర కౌన్సిలర్ ఎల్లయ్య బాబు, కోశాధికారి జోగా రాజేష్, సీనియర్ నాయకులు రొంగలి ఉమాదేవి, ఎస్ ఎస్ నాగమణి, జీకేఆర్ స్వామి, అలివేలు, వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

✦ పుట్ట గొడుగులు ప్రియం!



వానాకాలం వచ్చిందంటే చాలు పల్లెల్లో ప్రకృతి సిద్ధంగా లభించే పుట్టగొడుగులు ఎక్కడికక్కడ కనిపిస్తాయి. ఏటా జూన్‌లో వర్షాలు మొదలు కాగానే తొలి దశ పుట్టగొడుగులు లభిస్తాయి. ఈ ఏడాది జూన్, జూలైలో వర్షపాతం అంతగా నమోదు కాకపోవడంతో ఇవి పెద్దగా దొరకలేదు. ఇటీవల జోరుగా వానలు కురవడంతో రెండో దశ(దసరా పుట్టగొడుగులు)లో అక్కడక్కడా లభిస్తున్నాయి. గ్రామాల్లో మాంసాహారానికి సమానంగా భావించే ఈ పుట్టగొడుగుల ధరలు ప్రస్తుతం బజార్లలో ప్రియంగా ఉన్నాయి. రుచితోపాటు ప్రొటీన్లు, విటమిన్లు(ప్రధానంగా బి, డి), ఖనిజాలతోపాటు ఫైబర్ కూడా ఎక్కువ. వర్షాకాలంలో వచ్చే జ్వరాలు, ఇన్‌ఫెక్షన్ల నుంచి ఇవి రక్షిస్తాయని నమ్మకం. రానున్న వారం పది రోజుల్లో వర్షాలు జోరుగా కురిస్తే పల్లెతో పాటు పట్టణాల్లో కూడా పుట్టగొడుగుల కూర గుభాళించనుంది. – పెందుర్తి

యూరియాపై ఆందోళన వద్దు

ఆర్డీవో షేక్ ఆయిషా



కూండ్రంలో రైతుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో షేక్ ఆయిషా

అనకాపల్లి: స్థానిక రెవెన్యూ డివిజన్ పరిధిలో రైతుకు యూరియా కొరత లేదని ఆర్డీవో షేక్ ఆయిషా తెలిపారు. మండలంలో కూండ్రంలో ఆదివారం రైతు సేవా కేంద్రం వద్ద రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యూరియా కోసం రైతులు అధైర్య పడవలసిన అవసరం లేదన్నారు. వరి నాట్లకే కాకుండా ఇతర పంటలకు కావలసినంత యూరియా అందుబాటులో ఉందన్నారు. అనకాపల్లి మండలంలో ఊడేరు, బవులవాడ, తుమ్మపాల, వల్లూరు, రాజుపాలెం గ్రామాల్లో వ్యవసాయ శాఖ ద్వారా యూరియా సంబంధించి గ్రామ సభలు నిర్వహిస్తున్నామన్నారు. వ్యవసాయ సహాయ సంచాలకుడు సిహెచ్. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రతి రైతు సేవ కేంద్రంలో యూరియా రైతుల అవసరం మేరకు రెండు రోజుల్లో అందుబాటులో తీసుకొస్తున్నామని చెప్పారు. ఏవో పి. రంగాచారి మాట్లాడుతూ మండలంలో ఇంత వరకూ 571 మెట్రిక్ టన్నులు యూరియా రైతులకు అందజేశామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ డి.శాంతిభూషణరావు, సర్పంచ్లు నందారపు లక్ష్మి, తట్ట పెంటయ్య నాయుడు, సిరిగిరిశెట్టి కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ మండలాధ్యక్షునిగా సూర్యనారాయణ



ఏపీటీఎఫ్ మండల శాఖ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

కశింకోట: ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షునిగా కె. సూర్యనారాయణ ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక బాలికల ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన శాఖ సర్వసభ్య సమావేశంలో ఎన్నికలు జరిగాయి. ఉపాధ్యక్షులుగా జి. దేముడుబాబు, టి. తాయారమ్మ, జి. సునీత, వై. శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా పి.ఎం. అప్పారావు, కార్యదర్శులుగా ఎం.ఎస్. క్రిష్టోఫర్, పి.వి.డి. ప్రసాద్, కె. వగలేశ్వరరావు, డి. శ్రీదేవి, యు. ఉషాకిరణ్, గౌరవాధ్యక్షునిగా ఎస్. రమణ, జిల్లా కౌన్సిల్‌గా పి. గణపతి, డి.ఎస్. మల్లేశ్వరరావు, ఇ.ఎం. రఘురాం, పి. బలరాం, డి. సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎం.డి.కె. విజయలక్ష్మి ఎన్నికల పరిశీలకునిగా వ్యవహరించారు. కొత్త కమిటీతో పదవీ స్వీకార ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం అధికారులను సమన్వయం చేసుకొని కృషి చేస్తామన్నారు. అనంతరం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు దాడి కాళిదాసు, ఇ. రామారావులను సత్కరించారు. బదిలీ అయిన 25 మంది ఉపాధ్యాయులకు వీడ్కోలు, కొత్తగా వచ్చిన వారికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వపు కార్యదర్శి బి. వెంకటపతిరాజు, ఉపాధ్యక్షుడు టి. త్రినాథ్, జిల్లా అధ్యక్షుడు కె.వి.ఎల్.ఎస్. ధర్మారావు, ప్రధాన కార్యదర్శి ఎస్. దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు అప్రంటిస్‌షిప్ మేళా

కంచరపాలెం: పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)లో కోర్సులు పూర్తి చేసి అప్రెంటిస్ చేయని అభ్యర్థుల కోసం కంచరపాలెంలోని విశాఖ ప్రభుత్వ పాత ఐటీఐ కళాశాల ఆవరణలో సోమవారం ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా-2025 నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్, జోన్-1 ఉప సంచాలకుడు ఆర్ వి.రమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే, హిందుస్తాన్ షిప్ యార్డ్, ఆలిండియా రేడియో, మేధా సర్వో డ్రైవ్స్, జయభేరి లిమిటెడ్ కంపెనీలతోపాటు 12కి పైగా ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు సోమవారం ఉదయం 9 గంటలకు బయోడేటా, ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు.

స్నేహితుడి జ్ఞాపకార్థం వాలీబాల్ టోర్నీ

సబ్బవరం: తమ స్నేహితుడి జ్ఞాపకార్థం మిత్రులు వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. స్థానిక ప్రతిభ విద్యాలయంలో 2005-06 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు నిర్వహించిన ఈ టోర్నీని శాప్ డైరెక్టర్ పీబీవీఎస్ఎన్ రాజు ముఖ్య అతిథిగా పాల్గొని పోటీలను ఆదివారం ప్రారంభించారు. ఈ బ్యాచ్‌కు చెందిన కర్రి శేషు 2022లో పాము కాటుకు గురై మరణించాడు. శేషు వాలీబాల్ ప్లేయర్ కావడంతో గత మూడేళ్లుగా ఆయన పేరిట ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. విజేతలకు నగదు బహుమతులను అందించి స్నేహితుడి గొప్పతనాన్ని ఏటా ఈ విధంగా గుర్తు చేసుకుంటున్నారు. ఈ పోటీల్లో పలు ప్రాంతాల నుంచి 11 జట్లు పాల్గొన్నాయి. విజేతలకు బహుమతులు అందించారు. ఆయన ఆర్థిక సాయంతో క్రీడాకారులకు మధ్యాహ్న భోజనం అందించారు.

ఇరుకు రోడ్డుతో ట్రాఫిక్ ఇక్కట్లు



పరవాడ సంతబయలులో ట్రాఫిక్ సమస్య

పరవాడ: పరవాడ సంతబయలు ప్రాంతంలో ఇరుకు రోడ్డుతో తరచూ తలెత్తుతున్న ట్రాఫిక్ సమస్యలతో గ్రామీణ ప్రజలు నిత్యం సతమతమవుతున్నారు. వాడచీపురుపల్లి, యలమంచిలి ప్రాంతాల నుంచి అనకాపల్లి, గాజువాక ప్రాంతాలకు రాకపోకలు సాగించే ఆర్టీసీ బస్సులు, ఆటోలు పరవాడ సంతబయలు మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి. పరవాడ సంతబయలు ప్రాంతం నుంచి గాజువాక, అనకాపల్లి వెళ్లే రోడ్డు మరీ ఇరుకుగా మారింది. ముందే ఇరుకు రోడ్డు ఆపై భారీ వాహనాల రాకపోకల వలన ఎదురెదురుగా వచ్చే వాహనాలు తప్పించుకొనే క్రమంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. మంగళవారం రోజున సంతబయలులో జరిగే వారపు సంత కారణంగా ఇరుకు రోడ్డుపై వ్యాపారులు, గ్రామీణ ప్రజలు సాగిస్తున్న వ్యాపార కార్యకలాపాల వలన వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సాధారణ రోజుల్లో కూడా ఆర్టీసీ బస్సులు ఒకదానికొకటి తప్పించుకొనే క్రమంలో ట్రాఫిక్ ఇక్కట్లలో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో వారపు సంత రోజున ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పోలీసులు చర్యలు తీసుకునేవారు. ప్రస్తుతం అలాంటి చర్యలకు పోలీసులు దూరంగా ఉండటంతో ట్రాఫిక్ సమస్యలను సరిదిద్దే నాథుడే కనిపించట్లేదు. ఫలితంగా ప్రయాణికులు ట్రాఫిక్ వలయంలో చిక్కుకుని గంటల తరబడి సతమతమవుతున్నారు. దీని పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రెవెన్యూ రీ సర్వే తప్పులు సవరించాలని వినతి



తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందిస్తున్న వియ్యపు చిన్న

పరవాడ: మండలంలోని రావాడ గ్రామ పంచాయతీలో జరుగుతున్న రెవెన్యూ రీసర్వే తప్పులు తడకగా ఉందని, దీంతో రైతులు రెవెన్యూ పరమైన సమస్యలను ఎదుర్కొంటున్నారని మండల టీడీపీ అధ్యక్షుడు వియ్యపు చిన్న ఆరోపించారు. ఈ మేరకు పరవాడ తహసీల్దార్ బి.నాగరాజును ఆదివారం కలిసి వినతి పత్రం అందించారు. గ్రామంలో రెవెన్యూ రీసర్వేలో సిబ్బంది రైతులకు చెందిన భూములను కాకుండా అదనంగా నమోదు చేయడం, విస్తీర్ణంలో హెచ్చు తగ్గులతో రైతులను రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిప్పుతున్నారని ఆక్షేపించారు. రీసర్వేలో జరిగిన తప్పులను సరిచేయాలని, లేకుంటే సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని హెచ్చరించారు. రీసర్వేలో జరిగిన తప్పుల్ని సరిచేసేందుకు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ భరోసానిచ్చినట్లు చిన్న తెలిపారు.